క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీగలగూడ, అఫ్జల్‌నగర్, బంజారానగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్‌టీఓ ఆఫీస్, బాలాజీ అపార్ట్స్ పరిసరాలు.
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మూసారాంబాగ్, జ్ఞాన్‌దీప్ టవర్, కృష్ణతులసీ నగర్, అండాళ్ నిలయం, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, ఇంద్రానగర్, ఎస్‌బీఐ కాలనీ పార్క్, నోబుల్ డిగ్రీ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.
- హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సాయికాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, 11కేవీ బీరప్పకాలనీ, ఆర్.కె.పురం, అల్కాపురి ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

నేటి నుంచి గణేశ్ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ గణేశ్ ఆలయంలో 25వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 13 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ సేవా సమితి అధ్యక్షుడు కె.ధర్మారావు గుప్తా, ప్రధాన కార్యదర్శి పీవీకే సోమయాజులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, విశేష హోమాలు, యాగాలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మైసూరు దత్తపీఠం స్వామి శ్రీగణపతి సచ్చినంద స్వామిజీ వారి దత్త బృంద సమాజం ఆధర్యంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ వారణాసి వంశీ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నేతల నిరసన



చైతన్యపురిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చైతన్యపురి: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, యాదవ కులంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డికి మంత్రి శ్రీనివాసయాదవ్‌ను విమర్శించే స్థాయిలేదన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు త్రివేది, సన్నీయాదవ్, పవన్, రమణారెడ్డి, వీరన్నయాదవ్, అనిత, సరిత, నరహరి, అంజయ్య, కోటి, శ్రీకాంత్, టింకు, రమేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి రూ.62 లక్షలు

కౌన్సిలర్ అహ్మద్ కసాది

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని నబీల్ కాలనీలో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరిస్తామని 3వ వార్డు కౌన్సిలర్ అహ్మద్ కసాది అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీఈ వెంకన్నతో కలిసి కాలనీలో పర్యటించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. వర్షపు నీరు, మురుగు వెళ్లేందుకు సరైన మార్గం లేక కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించడంతో రూ.62లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పనులు పూర్తైతే మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అభివృద్ధి పనులకు అడిగినవెంటనే నిధులు కేటాయిస్తున్న మంత్రి సబితారెడ్డి, చైర్మన్ అబ్దుల్లా సాదిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రహదారిపై మట్టికుప్పలు.. నిర్మాణ వ్యర్థాలు



లలితానగర్ కాలనీలో రహదారి పక్కన నిర్మాణ వ్యర్థాలు డంప్ చేసిన దృశ్యం

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు

చైతన్యపురి: రహదారుల మధ్యలో మట్టికుప్పలు, రోడ్డుపక్కన నిర్మాణ వ్యర్థాలు, సామగ్రి నెలల తరబడి అలాగే ఉన్నా... జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదు. గడ్డిఅన్నారం డివిజన్ లలితానగర్ కాలనీలో నెలకొన్న పరిస్థితి ఇదీ.

- ఇటీవలే కాలనీలో అందంగా సీసీ రోడ్డు వేశారు. అయితే, కొందరు రహదారిపై మట్టి, నిర్మాణ సామగ్రిని డంప్ చేయటంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- లోటస్‌ల్యాప్ స్కూల్ రహదారిలో రోడ్డు పక్కనే బిల్డింగ్ వ్యర్థాల కుప్పలు దర్శనమిస్తున్నాయి. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- బిల్డింగ్ వ్యర్థాలు రహదారుల పక్కన డంప్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- ఇళ్ల నిర్మాణ సమయంలో కొందరు చెట్లను కొట్టివేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు అంటున్నారు.



లలితానగర్ కాలనీలో రహదారి పక్కన నిర్మాణ సామగ్రి

- కాలనీలో అధిక శాతం కమర్షియల్ దుకాణాలు ఉండటం వల్ల రహదారుల పక్కనే వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కు చేస్తున్నారని తద్వారా కాలనీలో రాకపోకలు సాగించడం కష్టంగా మారిందంటున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టికుప్పలు తొలగించాలని, నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను తొలగింప చేయాలని కోరుతున్నారు.



రహదారి మధ్యలో మట్టికుప్పలు

'మెట్రో' పార్కింగ్‌తో ఇబ్బందులు లేకుండా చూడాలి



చైతన్యపురి మెట్రో స్టేషన్ దగ్గర పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మెట్రో, ట్రాఫిక్ అధికారులు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: మెట్రో ప్రయాణికులు తమ వాహనాలను కాలనీల రోడ్లపై పార్కు చేయటం వల్ల రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సు.దీర్‌రెడ్డి అన్నారు. మెట్రో, ట్రాఫిక్ అధికారాలతో కలిసి చైతన్యపురి, ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపంలోని కల్యాణ్ జ్యువెలర్స్ పక్కరోడ్డులో మెట్రో ప్రయాణికులు వాహనాలను పార్కు చేయటం వల్ల ఎల్‌బీనగర్ కాలనీలోకి వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందుల పడుతున్నారన్నారు. అలాగే ఎల్‌బీనగర్ ఫ్లైఓవర్ దగ్గర మసీద్ గల్లీ వైపు వెళ్లే ప్రాంతం చాలా ఇరుకుగా ఉందని, ఆ రోడ్డులోని ఫుట్‌పాత్‌లను తొలగించటం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయన్నారు. త్వరలో మెట్రో ఎండీతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మెట్రో డైరెక్టర్ బాలకృష్ణ, చీఫ్ ఇంజినీర్ సాయప్పరెడ్డి, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ హరికృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నేరవేర్చుతున్నా: కొప్పుల

మన్సూరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేర్చుతున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి పవనగిరి కాలనీ ఫేజ్–3లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడేది లేదని స్పష్టంచేశారు. కాలనీలోని మిగతా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరినాథ్, కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహుడు, శ్రీనివాస్‌రెడ్డి, పీవీరావు, భీష్మాచారి, మోహన్‌రెడ్డి, నాయకులు సంపత్, సాయిరామ్‌గౌడ్, పారంద సాయి పాల్గొన్నారు.



పవనగిరి కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

అన్ని కాలనీల్లో కమ్యూనిటీహాళ్లు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో కమ్యూనిటీహాళ్ల ఏర్పాటు చేయిస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఐఎస్‌సదన్‌లోని వైశాలీనగర్ కాలనీ పార్కులో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కమ్యూనిటీ హాళ్లతో కాలనీలు, బస్తీలవాసులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. కాలనీవాసుల సమావేశాలకు, మహిళలకు కంప్యూటర్, కుట్టు శిక్షణ వంటి కేంద్రాల ఏర్పాటుకు వీలుంటుందన్నారు. స్థానికులు చిన్నపాటి శుభకార్యాలు చేసుకునేందుకు కమ్యూనిటీహాళ్లు ఉపయోగపడుతాయన్నారు.



కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర కల్యాణ మహోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీవాసులు పెద్ది శమ్మోహన్‌గుప్తా, మిడిదొడ్డి చంద్రశేఖర్‌గుప్తా నివాసంలో శుక్రవారం శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, గ్రీన్‌హిల్స్ కాలనీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాలే శ్రీమన్నారాయణ, కల్యాణ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, విప్లవ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మంత్రి సబితారెడ్డి శనివారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారనిబీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి



రాజీవ్‌గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని డ్రైనేజీ, శానిటైజేషన్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ ఫేజ్ 1-2ల్లో పర్యటించి కాలనీ వాసులను స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో రోడ్డు, డ్రైనేజీ, శానిటైజేషన్ సమస్యలను ఉన్నాయని, నిరంతరం డ్రైనేజీ పొంగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమస్యను వివరించి వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈ మాత్యనాయక్, కాలనీ అధ్యక్షుడు భిక్షపతి, యాసిన్, కిషన్, సైదులు, శ్రీకాంత్, రవి, వాటర్ వర్క్స్ అధికారులు సత్యనారాయణ, అఖిల్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన నకిలీ పోలీస్ అరెస్టు



నిందితుడు మనోజ్‌కుమార్

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌నని చెప్పి బెదిరింపులకు పాల్పడిన నకిలీ పోలీసును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గణేశ్‌నగర్‌కు చెందిన వెంకటేశ్‌యాదవ్ తన పాన్ నంబర్‌కు ఆధార్‌ను చింతలకుంటలోని మధుబాబుకు చెందిన మీసేవ కేంద్రంలో లింకు చేయించుకున్నాడు. అందుకు వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉండగా వెంకటేశ్ యాదవ్ డబ్బులు చెల్లించక పోవడంతో తరుచూ వెంకటేశ్‌కు ఫోన్‌చేసి మధుబాబు డబ్బుల గురించి అడుగుతుండేవాడు. వెంకటేశ్‌యాదవ్ అల్లుడైన హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్న బొల్లబోయిన మనోజ్‌కుమార్ మీసేవ నిర్వాహకుడు మధుబాబుకు ఫోన్‌చేసి "నేను వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్నా. నువ్వు మా మామ వెంకటేష్‌యాదవ్‌కు పదేపదే ఫోన్ చేసి డబ్బులు అడుగుతున్నావంట. మమ్మల్నే పైసలు అడుగుతావా' 'అని దుర్భాషలాడి చంపుతానని బెదిరించాడు. దీంతో మధుబాబు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నకిలీ పోలీస్ అని తేలింది. నిందితుడు సొనాట అనే ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నట్టు తేలింది. మనోజ్‌కుమార్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా అరెస్ట్ చేసి దాడి చేశారు: ఝాన్సీ

చైతన్యపురి: శ్రీనిధి, గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలల అనుమతులు రద్దు చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడి సందర్భంగా పోలీసులు తనను ముందస్తుగా అరెస్ట్ చేసి, కొట్టి దుర్భాషలాడారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ఆరోపించారు. గురువారం పోలీసుల దాడిలో గాయపడ్డ ఝాన్సీ దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ గురించి ఆందోళన చేపడితే తనపై మగ పోలీసులు అమానుషంగా ప్రవర్తిస్తే తట్టుకోలేక ఆత్మరక్షణ కోసం ప్రతిఘటించాను తప్ప వారిపై తాను చేయి చేసుకోలేదన్నారు. స్టేషన్‌లో తనను కొట్టమని ఏసీపీ అక్కడి సీఐకి పురమాయించగా ఒక రూమ్‌లో బంధించి నలుగురు మహిళా పోలీసులు ఇష్టం వచ్చినట్లు తన్నడమే కాకుండా తిట్టారని ఝాన్సీ ఆరోపించారు. ప్రశ్నించే గొంతులు మూయించటమే తెలంగాణ ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు.



ఝాన్సీని పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

ఝాన్సీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ ...

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఝాన్సీని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. జరిగిన ఘటన గురించి ఆమెను అడిగి తెలుసుకున్నారు. మహిళా విద్యార్థి నాయకురాలిపై పోలీసుల తీరును వారు తీవ్రంగా ఖండించారు.

బీజేపీకి యువత, మహిళల మద్దతు



వాల్ పెయింటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ఇంటింటికీ తిరిగి బీజేపీ పాలన, కేంద్ర ప్రభుత్వ పథకాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌లో శుక్రవారం వాల్ పెయింటింగ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, బీజేపీ వాల్ పెయింటింగ్ అభియాన్‌ను ప్రజలు స్వాగతిస్తున్నారని, యువత, మహిళలు బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్, ఉదయ్, తులసి, సందీప్, రాజు, యశ్వంత్ దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలి



ఖోఖో విజేత, రన్నరప్ జట్లతో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: యువత క్రీడల్లోనూ ఆసక్తిని పెంచుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సూచించారు. ఖేలోభారత్-జీతో భాగ్యనగర్ పేరిట హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఖోఖో ఫైనల్ పోటీలో చాంద్రాయణగుట్ట కేంద్రీయ విద్యాలయం జట్టు.. మహావీర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. విజేతను, రన్నరప్ జట్లను బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అభినందించారు.

వాలీబాల్‌లో కొత్తకాపు టీం విజయం..

ఖేలో భారత్ పోటీల్లో వాలీబాల్ అంశంలో కొత్తకాపు టీం విజయం సాధించి టోర్నీని దక్కించుకుంది. గురువారం రాత్రి నిర్వహించిన ఫైనల్ పోటీలో కొత్తకాపు రవీందర్‌రెడ్డి టీం తన ప్రత్యర్థి అత్తాపూర్ టీంపై గెలుపొందింది. టోర్నమెంట్ దక్కించుకున్న టీం సభ్యులను సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ అభినందించారు.

ఆకట్టుకున్న దశావతారం నాటక ప్రదర్శన

కాచిగూడ: 'బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ థియేట్రిక్స్ క్లబ్' ఆధ్వర్యంలో విష్ణుమూర్తి 10 అవతారాలను చూపించే అద్భుతమైన దశావతారం నాటక ప్రదర్శనను కాచిగూడలోని కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులు ప్రదర్శించారు. శుక్రవారం 25 మంది విద్యార్థి కళాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శన చేశారు. కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక, కళారంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అన్ని రంగాలపై విద్యార్థులకు అవగాహన ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారన్నారు. ఆ దిశగా విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, డాక్టర్ ఎం.జానకీరామ్, డాక్టర్ వెంకటయ్య తదితరులున్నారు.



క్రికెట్ బెట్టింగ్స్... ఇద్దరి అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

హస్తినాపురం క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసుల సంయుక్తంగా దాడిచేసి బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వనస్థలిపురం కమలానగర్‌కు చెందిన నీలపాల నరేష్‌యాదవ్(38), గౌతమీనగర్‌కు చెందిన అవనగంటి అంజయ్య(33)లను అరెస్ట్ చేశారు. రూ. 1.5 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించామని, సచిన్‌దిలీప్ దలియా అనే బుకీ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

మరో బెట్టింగ్ ముఠా ఆటకట్టు



కికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న సొత్తు

చైతన్యపురి: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురిని ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు...షయనాజ్‌గంజ్ గ్యాన్‌బాగ్ కాలనీకి చెందిన శైలేందర్ అగర్వాల్(36) ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో సులువుగా డబ్బు సంపాదన కోసం శైలేందర్ క్రికెట్ బెట్టింగ్ ప్రారంభించాడు. సెల్‌ఫోన్, వాట్సాప్ ద్వారా డబ్బులు కలెక్ట్ చేస్తూ పంటర్లకు కమీషన్ ఇస్తున్నాడు.శైలేందర్‌తో పాటు సరూర్‌నగర్ సాయినగర్‌కు చెందిన ఉగ్గి శ్రీధర్ (38), వెంకటేశ్వర కాలనీకి చెందిన కనుకు గణేష్ (33)లు ఐపీఎల్ కేకేఆర్, ఆర్‌ఆర్ క్రికెట్ మ్యాచ్‌కు బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉజ్వల భవిష్యత్



కాచిగూడ: నైపుణ్యాభివృద్ధి కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదవలేదని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రామయ్య అన్నారు. కాచిగూడలోని ఎంఎస్‌ఎస్ లా కళాశాల, ఆర్.జి.కేడియా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'విద్యలో నాణ్యతా నైపుణ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణను వినియోగించుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ డీవీజీ కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీహరి, రాంచంద్రమూర్తి, ప్రొఫెసర్ డాక్టర్ వందన సాంబ తదితరులున్నారు.